క్లుప్తంగా

మంత్రి సీతక్క ఎత్తు బంగారం సమర్పణ



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని గుర్రం పేట మినీ మేడారం జాతరలో రాష్ట్ర మంత్రి సీతక్క నిలువెత్తు బంగారాన్ని తల్లులకు సమర్పించినట్లు ములుగు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కోడూరి రమేష్ తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు మంత్రి సీతక్క నిలువెత్తు బంగారం తల్లులకు సమర్పిస్తానని మొక్కుకుందని తెలిపారు. మంత్రి మేడారం జాతరతో ఉన్న సందర్భంగా సీతక్క ఆదేసానుసారం ఆ మొక్కును శనివారం తీర్చామని తెలిపారు.

గట్టమ్మను దర్శించుకున్న ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ములుగు రూరల్: ములుగు గట్టమ్మ తల్లిని శనివారం బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ శనివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్‌కు జిల్లా బీఎస్పీ నాయకులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

రూ.11లక్షల ఆదాయం

చిట్యాల: మేడారం శ్రీ సమ్మక్క- సారలమ్మ జాతర సందర్భంగా మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు పాయింట్ ద్వారా రూ. 11లక్షల ఆదాయం వచ్చినట్లు పరకాల డిపో మేనజర్ రవిచందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రం నుంచి 134 ట్రిప్పులతో 4,500 మంది భక్తులను తరలించినట్లు పేర్కొన్నారు. ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకున్న భక్తులకు, క్యాంపు నిర్వహించిన సిబ్బందికి డీఎం రవిచందర్ కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: హైదరాబాద్ పబ్లిక్ పాఠశాల(రామంతాపూర్)లో ఒకటవ తరగతిలో ప్రవేశాలకు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ఎస్సీ విద్యార్థుల నుంచి రేపటి నుంచి మార్చి 12వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి సునీత శనివారం ప్రకటనలో తెలిపారు. 1జూన్ 2017 నుంచి 31మే 2018 మధ్య జన్మించిన వారు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను వచ్చే నెల 12వ తేదీ వరకు వరకు జిల్లా కేంద్రంలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో అందించాలని సూచించారు. వివరాలకు జిల్లా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం



చిట్యాల: మండల కేంద్రానికి చెందిన మైదం సురేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో అతడితో కలిసి 1988–89 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు బాధిత కుటుంబానికి రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మిత్రులు శృంగారపు రంగాచారి, పాసికంటి మల్లేషం, దేశెట్టి రాజు, బుర్ర కుమారస్వామి, ముప్పిడోజు భిక్షపతి, ప్రభాకర్, గాజుల రమేష్, పుట్టకొక్కుల రవీందర్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్వేషాలు సృష్టిస్తే కేసులు

టేకుమట్ల: వాట్సాప్, ఫేస్‌బుక్, తదితర యాప్‌ల్లో ఇతరుల మనోభావాలను దెబ్బ తీసే విధంగా విద్వేషాలు సృష్టిస్తే కేసులు తప్పవని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు సెల్‌ఫోన్‌ను నిరంతరం వినియోగిస్తున్నారని, సెల్ ఫోన్‌ను అవసరమున్నంత వరకు మాత్రమే వినియోగించాలని సూచించారు. సెల్ ఫోన్‌లో వాట్సాప్, ఫేస్ బుక్, తదితర యాప్‌ల్లో కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా గానీ, వ్యక్తిగతంగా ఇతరులను ఉద్దేశించి కించ పరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే కేసులు తప్పవని హెచ్చరించారు.

అడవిలోకి.. వన దేవతలు

● ప్రశాంతంగా ముగిసిన మినీజాతరలు



మొగుళ్లపల్లి: పూజలు నిర్వహిస్తున్న పూజారులు



రేగొండ: తల్లులను వనంలోకి తీసుకెళ్తున్న పూజారులు

చిట్యాల: మండలంలోని వెంచరామి శివారు పురేడు గుట్ట వద్ద మూడు రోజులగా ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన సమ్మక్క–సారలమ్మ జాతర శనివారం ప్రశాంతగా ముగిసింది. దీంతో పూజారులు తల్లులను జనం నుంచి తిరిగి వనంలోకి వెళ్లారు. తల్లులను ఎండోమెంట్ ఈఓ నాగేశ్వర రావుతో పాటు సభ్యుడు మధుకర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మురళి తల్లులను ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. కాగా హూండిలో వేసిన కానుకలను ఆదివారం లెక్కించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ తెలిపారు.

మొగుళ్లపల్లి: ముల్కలపల్లి–మొగుళ్లపల్లి గ్రామాల మధ్య నిర్వహించే సమ్మక్క–సారలమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం ముగిసింది. గోవిందరావుపేట మండలం ఇప్పలగూడెం గ్రామం నుంచి వచ్చిన పూజారులు దనసారి సాంబరావు, దనసారి గట్టయ్యలు తల్లులకు ప్రత్యేక పూజలు నిర్వహించి వనప్రవేశం చేయించారు.

రేగొండ: సమ్మక్కసారలమ్మ మినీ మేడారం మినీ జాతర శనివారంతో ముగిసింది. తల్లులిద్దరూ గద్దెను వీడి వనం చేరారు. తల్లులను తీసుకెళ్లే క్రమంలో ప్రత్యేక పూజలతో గద్దెల ప్రాంగణాలు కిక్కిరిశాయి. ఆఖరి రోజు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు.



చిట్యాల: దర్శనం చేసుకుంటున్న నాగేశ్వరరావు

మంత్రి సీతక్కకు ఆశవర్కర్ల వినతి

మేడారం(కాటారం): మేడారం జాతర విధులకు వచ్చిన ఆశ వర్కర్లు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు ప్రమాద బీమా సౌకర్యం, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ విషయంపై మంత్రి సీతక్క సానుకూలంగా స్పందించినట్లు ఆశ కార్యకర్తలు తెలిపారు. మంత్రికి వినతిపత్రం అందజేసిన వారిలో యూనియన్ జిల్లా మహిళ నాయకులు నాగమణి, శ్రావ్య, అమరావతి, ప్రభావతి, శోభ, రజిత ఉన్నారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

వెంకటాపురం(కె) : రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైన సంఘటన మండల పరిధిలోని ఉప్పేడు గొల్లగూడెం గ్రామసమీపంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గొల్లగూడెం గ్రామానికి చెందిన మహిళ కూలీలు గ్రామ సమీపంలో ఉన్న మిర్చి తోటల్లో పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో ఆలుబాక వైపు నుంచి వేగంగా వస్తున్న ట్రాలీ ఆటో వెనుక నుంచి నలుగురి కూలీలను ఢీ కొట్టి ఆటో పల్టీ కొట్టిందని తెలిపారు. ఈ ప్రమాదంలో స్వరూప, కుమారి, దుర్గ, రాజేశ్వరి అనే నలుగురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు. విషయం తెలుసుకున్న ఎస్సై అశోక్ సంఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదం జరగటానికి గల కారణాలను తెలుసుకున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

కొలతల ప్రకారం పనులు చేయాలి

కాటారం: ఉపాధిహామీ పథకంలో భాగంగా కూలీలు కొలతల ప్రకారం పనులు నిర్వహిస్తే అధిక డబ్బులు పొందవచ్చని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్ అన్నారు. మండలం ధన్వాడ చిన్న ఉటకుంటలో కొనసాగుతున్న ఉపాధిహామీ పనులను శనివారం డీఆర్‌డీఓ పరిశీలించారు. పనుల, కూలీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొలతలకు అనుగుణంగా పనులు చేస్తే కూలీలు రోజుకి రూ.272 పొందవచ్చని తెలిపారు. కూలీలు అధిక సంఖ్యలో పనులకు హాజరయ్యేలా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ధన్వాడలో ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి షెడ్ నెట్ ఏర్పాటు చేయాలని, కట్టింగ్ ప్లాంట్ గన్నేరు, గులాబీ, మందార, పండ్ల మొక్కలు నాటాలని ఆదేశించారు. మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ సందర్శించి వాటర్ ట్యాంకర్ ద్వారా మొక్కలకి ప్రతి రోజు నీరందించాలని తెలిపారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 85 శాతం మొక్కలు బ్రతికి ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. బాధ్యతలు స్వీకరించి మొదటి సారి ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చిన డీఆర్‌డీఓను ఎంపీడీఓ అడ్డూరి బాబు, అధికారులు శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. డీఆర్‌డీఓ వెంట ఏపీఓ వెంకన్న, టెక్నిక్ అసిస్టెంట్ శ్రీనివాస్, పంచాయితీ కార్యదర్శి ఉమాదేవి ఉన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ నరేశ్

నవీన్ మృతికి సంతాపం

ఏటూరునాగారం: జీతాలు రాక మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్న నల్లగొండ జిల్లాకు చెందిన మిషన్ భగీరథ కార్మికుడు నవీన్ మృతికి మిషన్ భగీరథ సంఘం జిల్లా నాయకులు శనివారం సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. మిషన్ భగీరథ కార్మికులు ఎవరూ ఇలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని అన్నారు. సమస్యలపై పోరాడి పరిష్కారించుకోవాలే తప్ప ఆత్మహత్యలు చేసుకోవద్దని సూచించారు. ఈ సందర్భంగా నవీన్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జెల్లి ప్రశాంత్, ఈసం లక్ష్మణ్, కయల్, శివకల్యాణ్, సంతోష్, రాకేష్, అనిల్ ఉన్నారు.



మౌనం పాటిస్తున్న మిషన్ భగీరథ కార్మికులు

ప్రధాన న్యాయమూర్తి చాంబర్ ప్రారంభం



కాళేశ్వరం: జడ్జి రాజేశ్వర్‌రావును సన్మానిస్తున్న అర్చకులు



భూపాలపల్లి రూరల్: ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌ను ప్రారంభిస్తున్న జడ్జి

భూపాలపల్లి రూరల్: జిల్లాలో కోర్టు భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌ను హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ జడ్జి నామవరపు రాజేశ్వర్‌రావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆఫీసర్లతో, కో ర్టు సిబ్బందితో, న్యాయవాదులతో ప్రత్యేకంగా స మావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి ల్లా ప్రధాన న్యాయమూర్తి నారాయణ బాబు, ము లుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీవీపీ లలిత శివ జ్యోతి, ఇతర జడ్జిలు, అడ్వకేట్‌బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏదులాపురం శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాళేశ్వరాయంలో రాష్ట్ర హైకోర్టు జడ్జి పూజలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని రాష్ట్ర హైకోర్టు జడ్జి నామవరపు రాజేశ్వర్‌రావు కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదపండితులు మంత్రోచ్ఛరణల మధ్యన ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారి గర్భగుడిలో అభిషేక అర్చన పూజలు నిర్వహించారు. ఆశీర్వచన వేదిక వద్ద అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి, తీర్థప్రసాదం అందజేశారు. వారి వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇతర జిల్లాల జడ్జీలు, పోలీసులు ఉన్నారు.

కోర్టుల ఏర్పాటుకు భవనాల పరిశీలన

మహదేవపూర్: మండల కేంద్రంలో జూనియర్ సివిల్ కోర్టుల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ భవనాలను శనివారం హైకోర్టు జడ్జి నమవరపు రాజేశ్వర్‌రావు పరిశీలించారు. అందుబాటులో గల ప్రభుత్వ పాత ఎంపీడీఓ కార్యాలయం, మాడ కార్యాలయం, జడ్జిలు నివాసం ఉండేందుకు మాడ విశ్రాంతి గృహం, ఆర్అండ్‌బీ, ఇరిగేషన్ విశ్రాంతి గృహం, ఎంపీడీఓ కార్యాలయంతో పాటు అనుబంధ గృహాలను పరిశీలించారు. త్వరలోనే కోర్టులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. మండల కేంద్రంలో నిజాం పాలనలో కోర్టు ఉండేదని ఇప్పుడు నూతనంగా మున్సిఫ్‌కోర్టు, సబ్‌కోర్టులు ఏర్పాటు చేయాలని ఎంపీపీ రాణిబాయి జడ్జికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి, ములుగు జిల్లాల న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, డీఎస్పీ రాంమోహన్ రెడ్డి, సీఐ రాజేశ్వర్‌రావు, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కృష్ణ, ఎస్సై ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

తాగు నీటి సౌకర్యం



బోర్‌వెల్‌ను ప్రారంభిస్తున్న మల్లీశ్వరి

వాజేడు: మండలంలోని మండపాక గ్రామస్తులు తాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న ఖమ్మంలోని గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ వారు బోర్ వెల్ వేశారు. కాగా, శనివారం ఏడ్జర్లపల్లి మాజీ సర్పంచ్ వాసం మల్లీశ్వరి చేతుల మీదుగా బోర్ వెల్‌ను ప్రారంభించి మంచి నీటిని అందించారు. ఈ కార్యక్రమంలో బోర్‌వెల్ ఇన్‌చార్జ్ రాయుడు జయరాజు, ముర్రం రాజేష్, మోషే, శ్రీను, మల్లయ్య గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

మల్హర్: శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు జన్మదినం సందర్భంగా మండలంలోని పెద్దతూండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలోని 10 తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు శనివారం పరీక్ష ప్యాడ్లు, స్కేల్స్, పెన్సిల్, ఎరైజర్స్‌లను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఈ ప్రాంత ప్రజలకు, నిరుపేద కుటుంబాలకు అనేక విధాలుగా సహాయపడుతున్న కుటుంబం దుద్దిళ్ల కుటుంబమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జక్కుల వెంకటస్వామి, జిల్లా యువజన కాంగ్రెస్ నాయకులు మండల రాహుల్, బండ విష్ణువర్ధన్‌రెడ్డి, రాములు, నరేష్, రమేష్, రాములు, రమేష్,శ్రీనివాస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మేడారం(కాటారం): మేడారం జాతరలో కళాజాతా బృందం అంటువ్యాధులపై అవగాహన కల్పిస్తూ శనివారం ప్రదర్శన ఇచ్చారు. అంటువ్యాధులు సోకకుడా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రతపై రమేశ్ స్పందన జానపద బృందం ఆధ్వర్యంలో పాటలు పాడుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



బాపు (ఫైల్)

కాటారం: విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని దామెరకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మీపూర్‌లో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోషం బాపు(58) అనే రైతు అతడి పొలం దగ్గర విద్యుత్ బోరు మోటార్ ఆన్ చేయడానికి వెళ్లాడు. మోటార్ స్టార్ట్ కాకపోవడంతో విద్యుత్ సరఫరా అయ్యే తీగ కనెక్షన్ ఎక్కడైన తెగిపోయిందని భావించి ట్రాన్స్‌ఫార్మర్ వరకు గల తీగను చెక్ చేస్తూ వెళ్లాడు. ఇదే క్రమంలో విద్యుత్ తీగ తెగిపోయి ఆకస్మాత్తుగా వచ్చి బాపు ఛాతి భాగం వద్ద తాకింది. దీంతో బాపు విద్యుత్‌షాక్‌కు గురై కిందపడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. అటువైపుగా వెళ్లిన రైతులు గమనించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య పార్వతి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు కాగా చిన్న కుమారుడు కొన్ని నెలల క్రితం చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు.

విలువలతో కూడిన విద్యతోనే ఉన్నతి

నర్సంపేట : విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తేనే వారు జీవితంలో ఉన్నతి సాధించగలరని హైదరాబాద్ డీజీపీ కార్యాలయ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ డి.నాగరాజు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను శనివారం ఆయన సందర్శించి విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సమాజాన్ని సజావుగా నడిపించేందుకు వ్యవసాయం, విద్యాబోధన, వైద్యం, రక్షణ కీలకమని చెప్పారు. సమాజం పట్ల గురువు బాధ్యతలు ప్రత్యేకమని తెలిపారు. విద్యార్థులకు తరగతి గదుల్లో నిర్దేశిత పాఠ్యాంశాలే కాకుండా సమాజం పట్ల అవగాహన కల్పించాలని, బాధ్యత నేర్పాలని సూచించారు. అమ్మ చెంప దెబ్బకు, గురువు బెత్తం దెబ్బకు మారని విద్యార్థి పోలీస్ లాఠీ దెబ్బ తినాల్సి వస్తుందని హాస్యం జోడించి హెచ్చరించారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా విద్యార్థులు కుంగిపోవద్దని స్పష్టం చేశారు. క్షణికావేశంలో తప్పుడు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. సమస్యలు జీవితంలో భాగమని, ధైర్యంగా ఎదుర్కొని విజయాలు సాధించాలని తెలిపారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామం నుంచి పరకాల వరకు నిర్మించబోయే రోడ్డు పనిని శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌టీఎస్‌డీఎఫ్ నిధుల నుంచి మంజూరైన రూ. 7 కోట్ల నిధులతో పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. వీలైనంత త్వరగా రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, పరకాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ఏరుకొండ శంకర్, నిమ్మల రమేష్, రవి, రాంరెడ్డి, తిరుపతి రెడ్డి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు